# ముక్తధార

'నే వెడుతున్నా తులిసెమ్మా, వీధితలుపు గడియ వేసుకో' అని అరిచేడు ప్రసాదం మావఁ. అతనింకా తలుపు జారేశాడు. ఇంతలో నాలుగు గంటలు టంగుటంగున కొట్టేరు. ఆ గంటల్లోనుంచే వూడిపడ్డట్టు వచ్చేడు తులసెమ్మ భర్త రమణమూర్తి.

'అప్పుడే వెడిపోడమా కక్కా' అంటూనే వున్నాడు. ఇంతలో రైలు కూసినట్లు ఇంట్లోంచి కేకలు 'ఆ... అలాగే... వేసుకుంటాగడియ-వచ్చేటప్పుడు మహా చెప్పేడిసినట్టు- వెళ్లేటప్పుడు చెప్పడానికి. పైగా కుక్కపిల్లోటి ఈ సౌభాగ్యానికి తోడు-వెధవ కుక్కపిల్లలూ పందిపిల్లలూ...'

దభాల్న తలుపు దగ్గరపడి, ధడాల్న గడియ పడింది- మూర్తి గుండె అదిరేలా. తెల్లబోయి వెర్రికుట్టిలా మొహంపెట్టి చూశాడు వాళ్ళ కక్కవైపు. అతనేం నొచ్చుకోలేదు... పైగా భుజాలు సర్దుకుని చిరునవ్వుతో రిస్టువాచీ చూసుకున్నాడు.

'ఈ ఇల్లొక సత్రపుకొంప. వచ్చేవాళ్ళు, వెళ్ళేవాళ్ళు- ఇంటి యజమానన్నవాడికి ఇంగితజ్ఞానం లేకపోతే ఇల్లాలు బానిసవుతుంది—' లోపలినుంచి ఆరున్నర శృతిలో మేఘాల్లో విలీనం అయింది కూత. గుండె చురుక్కుమని మూర్తి తిరిగి నాలుక కరుచుకున్నాడు. ప్రసాదం కక్క తిరిగి చిరునవ్వు నవ్వి దారిన వెడుతున్న రిక్షాని ఆగమని సౌంజ్ఞ చేశాడు. రిక్షావాడు అరుగుమీదవున్న తోలుపెట్టె, హోల్డాలు రిక్షాలో పెట్టాడు.

మూర్తి గొంతు పిసుక్కుపోయింది. 'మళ్ళీ యెప్పుడు రావడం?' పెలుకురాసిన కంఠంతో అడిగాడు.

ప్రసాదం కక్క ఫలానప్పుడని సీరియస్‌గా చెప్పబోయాడుగాని తన వాడుక ప్రకారం భుజాలు దులుపుకుని క్రిందిపెదాలతో మీసాల కొసలు తాకుతూ అన్నాడు.

'రవణా ! ఏమనుకోకు. మీ ఆవిడ చాలా మంచిదిరా. అలా ఊరికే దబడబలాడుతుందిగాని దాని మనసు కోమలం సుమీ. పొద్దున్న నువ్వాఫీసుకి వెళ్ళాక నాకొక కప్పు పాలిచ్చిందిరా. ఎందుకులే తులసమ్మా నీకీ శ్రమ, అంటే కిక్కురుమనకుండా వెనుదిరిగింది. వంటింట్లోకి వెడుతూనే విరుచుకుపడ్డట్టు- 'ఎందుకేఁవిటి, ఎందుకట— తాగడానికి— మీ ముసలాళ్లు అస్తమానం కాఫీలు మింగుతూంటే నీరసం పట్టుకు ఛస్తారు— అందుకు' అంది. దాన్ని జాగ్రత్తగా చూస్తూండు.'

'ఏం చూడ్డం కక్కా- విసుగెత్తిపోతూంది. అది నానాటికి రకరకాలు కళాకళలు తేలుతూంది. ఇప్పుడు నువ్వాయిపోయేవుసరి. పైవాళ్ళయితే పరువు పోదూ ?'

'ఆఁ యేంపోదు-కొంచెం ఓపిక కావాలోయ్.' అతడు రిక్షాయెక్కి 'బైబై' చెపుతూ వెడిపోయేడు. వెనుదిరిగి మూర్తి తలుపు తట్టాడు.

లోపలికివెళ్ళి కాళ్ళూచేతులూ కడుక్కుని అన్నాడు, 'కక్కవెడిపోయినట్టుంది-రిక్షాలో పెట్టే బెడ్డింగుతో ఔపించేడు...'

'ఆ దయచేశారు ప్రసాదం బావగారు' తులిసెమ్మ మామూలుగా వున్నప్పుడు సరైన వరసలతో పిలుస్తుంది. రిమ్మ యెత్తిందంటే పిలిచిన వరసతో మళ్ళీ పిలవదు.

* * *

రెండేళ్ళ క్రితం ఆమెకొక శస్త్రచికిత్స జరిగింది. అదొక విపరీతమైన పర్యవసానికి .దారితీసింది: పిచ్చి అని పిచ్చికాదు. కాని ఆమె మనో వాతావరణం ఎప్పుడెలా మారుతుందో చెప్పలేం.

చికిత్స తరువాత ఆస్పత్రిలోనే అల్లరి ప్రారంభించింది. నరుసుల్నీ డాక్టర్లనీ తిట్టిపోసింది. మందు తాగేదికాదు. రెండు మూడు థర్మామీటర్లు విసిరిపారేసింది. ఆమె బాధపడలేక వాళ్ళామెని ఆస్పత్రిలోంచి విడుదల చేశారు.

కాని ఆస్పత్రి విడిచిపెట్టే సమయంలో అందరితో చక్కగా మాట్లాడి అందరిదగ్గర శలవు తీసుకుంది. 'వెళ్ళొస్తా అచ్చమ్మా' అని గదులు తుడిచేదాని చేతిలో ఓ పావలా పెట్టింది. వార్డు మెట్లుదిగుతూంటే సూపరెంటమ్మ యెదురైంది.

'నమస్కారం! వెళ్తున్నానండీ...'

సూపరెంటమ్మ గుడ్లుతేలవేసింది. ఆవిడ కూడా ఇదివరకు తులసెమ్మ దగ్గర రెండు దీవనలందుకున్నదే.

'పిల్లలు లేకపోతే అదేపోయిరి...'

'పోనీ నన్ను పెంచుకోరాదు...' హాస్యం ఆడింది సూపరెంటమ్మ.

'మిమ్మల్నా... మీకేంకర్మ. మీరు త్వరగా పెళ్ళిజేసుకోండి. మీకు పురుడు నేనేపోస్తా...'

ఇద్దరూ విరగబడి నవ్వారు. సూపరెంటమ్మ చరచర నడిచింది. తులసెమ్మ కడుపులో మాత్రం భగ్గుమంది.

ప్రసాదంగారు రమణమూర్తికి కక్కా కాడు, తులసెమ్మకి మావా కాడు. దూరపు బంధువు. వాళ్ళతో బంధుత్వంకన్నా కలివిడి రాకపోకలు ఎక్కువ. అతడేదో కంపెనీలో పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు. కలకత్తా, వాల్తేరు, బొంబాయిలమధ్య తిరుగుతూంటాడు. వాల్తేరుమీదుగా వెళ్ళినప్పుడల్లా వీళ్ళింట్లో ఒకటి రెండు రోజులాగుతాడు. అతని రాకవల్ల వీళ్ళకేం ఇబ్బందిలేదు. పైగా లాభకరమే.

అతనికి నాఅన్న వాళ్ళెవరూలేరు. అతనికీ ఉంది కాస్త కొసవెర్రి. తోచిన వాళ్ళకు దోచి పెడతాడు. వచ్చినపుడల్లా 'తులసెమ్మకి' ఒక బహుమతి ఇస్తాడు. ఓమాటు చీర, మరోమాటు జోళ్ళు, యింకో మాటు ఫ్యాన్సీ వస్తువులు. తనతోకూడా ఒక కుక్కపిల్లని తెస్తాడు, ఎపుడూ.

తులిసెమ్మ మతి కుదురుగా వుందా. అతన్ని 'మావా' అని పిలిచి ఆప్యాయంగా అన్నీ చేసిపెడుతుంది. తిక్కపుట్టిందో గసిరి—'హోటలుకు పోయి తినండి. విష్యుంపుడి గారికిక్కడెవ్వరూ మర్యాద చెయ్యలేరు. వంటపూటివాళ్ళెవరూ సిద్ధంగాలేరు. కుంభాలు దించడానికి.'—అంటుంది.

* * *

'ఆ—దయచేసారు మీ నెత్తిమీద దేవతగారు. ఏం, ఒంటిగంట నుంచీ మూడువరకూ పోరంబోకులా గుఱ్ఱుకొట్టి నిద్రపోతున్నారు కదా. మధ్యాహ్నం చెప్పకూడదూ. యివాళే మెయిల్లో తగలడుతున్నానని. గోరెడంత శనగపప్పు నానబోశా. రాత్రి పొత్రోళ్ళేచేసి, యింగువ నూనె రాచి. అప్పడాల పిండి కలుపుదామని. తాపీగా మూడున్నరకి లేచి పొప్పు

తక్కువ నాలుక్కి చెప్పారు. ముసిలి అల్లుడుగారు — తులిసెమ్మా మెయిల్లో వెడుతున్నా,—అని

'పోనీ యిపుడేం పోయింది? మనమే తిందాం పాఠోళీ...'

'సా...డే! తిన్నట్టే! ఇవాళ తింటే రేపు పాసాలు.'

'పోనీ తులసీ-వుంచి-కాస్త తీసి, వుల్లిపాయలేసి, నాలుగు గారెలు చెయ్యి. మనకి టిఫిను. మిగిలింది మా చెల్లెలుగారింటికి పంపేయ్ - పిల్లల వాళ్ళు, యేదో చేసుకుంటారు....'

'చేసుకుంటారు. జమీన్దారీలు మండిపోతున్నాయి. నాతోయీ శష భిషలు పనికిరావు. పాఠోళీ, యింగువ నూనె, అప్పడాలపిండీ చేసి తీరుతా. ఎవరైనా గెస్టుని తీసుకురండి....'

అతడు కొంచెం వాదించబోయాడు. వాదన పెరిగి పెరిగి తిట్లు, శాపనార్థాలు అయి ఆమె ఏడుపు లంకించుకుంది. గతిలేక గెస్టుకోసం బయల్దేరాడు.

* * *

తులిసెమ్మ స్కూల్ ఫైనల్ దాకా చదివింది. స్వతహాగా ప్రాజ్ఞురాలే. పదేళ్ళ క్రిందట భర్త దగ్గిరకొచ్చింది. భర్తని సుఖపెట్టడంలో, గృహ నిర్వహణలో, ఇంటికి వచ్చినవాళ్ళని మర్యాద చెయ్యడంలో భేష్ అనిపించుకుంది. పోతే ఆమె మాట ముక్కుకి సూటిగా ఉంటుంది. చదువంటే సరదా. కథలూ, నవలల మీద 'తెలిసిన వాళ్ళం' అనిపించుకునే వాళ్ళకి కూడా ఆశ్చర్యం కలిగేలా అభిప్రాయం వెలిబుచ్చుతుంది. కాని పిల్లాపిచికా వేరే కాలక్షేపం లేకపోవడంవల్ల ఆమెకు తీరిక ఎక్కువైంది. దానివల్ల విసుగు, నిర్లక్ష్యం కలిగాయి. చీటికీ మాటికీ భర్తమీదో పనిమనిషి మీదో చివరికి కాకులూ పిచ్చికలమీదో చిర్రు బుర్రూ బుస్సూమనజొచ్చింది.

ఆమెకు ఆ ఇంట్లో ఒక్కర్తే స్నేహితురాలు. ఆ స్నేహం అయినా అంటీ అంటనిది. అది ఒక తెల్లటి ఆడపిల్లి. భర్త ఆఫీసుకువెళ్ళిన అర గంటలో ఆమె వచ్చి చావిట్లో కుర్చీమీద కూచుని చదువుకుంటూంటే ఎదురుగా మండువా స్తంభానికి ఆనుకుని ఆ పిల్లి పడుకునేది. తెరిచేకన్నూ మూసేకన్నుతో - అప్పుడప్పుడూ తులిసెమ్మ కిటికీలోంచి అగుపించే

క్రోటన్సువేపుచూసేది. సందులో గోలేలలో రకరకాల క్రోటన్సులున్నాయి. పూత కాపులేని ఆ క్రోటన్సుల వర్ణశోభ ఆమెని బాగా ఆకర్షించింది.

చివరకు ఆ పిల్లితో కూడా వైరంవచ్చింది తులసెమ్మకి. ఒకనాటి రాత్రి తొమ్మిదిగంటలకు ఆ పిల్లి పడకటింటి కప్పుమీదకూచుని అదేపనిగా ఎవరో చంటిపిల్ల ఏడ్చినట్టు గోలపెట్టింది. తులిసెమ్మ హడలిపోయి దిగ్గున లేచి పిల్లి ఏడుస్తుందేం అని అడిగింది భర్తని. అతడు నవ్వుతూ మగపిల్లితో కలిసి ఆడుకున్న తర్వాత ఆడపిల్లి అలాగే ఏడుస్తుందని చెప్పాడు. ఆమె కళ్ళు చిట్లించుకుంది. పిల్లిని తరిమివెయ్యమంది. మగపిల్లితో కలిసి ఆడపిల్లి యెలా ఆడుతుందో ఆ దృశ్యం వూహించుకుంటూ ఆమె రాత్రల్లా నిద్ర పట్టక యమబాధపడింది.

తరవాత కొన్నాళ్ళపాటు ఆడపిల్లి అగుపించలేదు. ఎటో పోయిందనుకుంది. కాని ఒకనాడు మధ్యాహ్నం పదకొండింటికి భోంచేసి చావిట్లో తీరిగ్గా కూర్చున్నప్పుడు పాత సామాన్లకొట్టు తలుపు సందులోంచి టెన్నిస్ బంతి అంత పిల్లిపిల్ల దూరి బైటకొచ్చి, నాలికతో పెదాలు గెడ్డంనాక్కుంటూ తోకతిప్పుతూ తనవేపు చూసింది. దానివెనక మరో పిల్లి పిల్ల, దానివెనక ఇంకోటి. తరవాత పెద్ద తెల్లపిల్లి కొట్టు కిటికీలోంచి ఛెంగున బయటకు దూకి తోక నిటారుగాపెట్టి ఒళ్లు సాగదీసుకుంది — ఈ మార్జాల కుటుంబాన్ని చూడగానే తులిసెమ్మకి చెప్పలేనంత అసహ్యం పుట్టుకొచ్చింది. ఆపాళంగా లేచి, 'ఫోండి, ఫోండి— వెధవ సంతానం' అని వాటిని తరిమింది. అవి నడవలోంచి వాకిట్లోకి, వాకిట్లోంచి సందులోకి పరుగెత్తేయి.

అంతకుముందు ఆమె అనుపంగా సంపాదించిన ఇద్దరు అరవ బిచ్చగాళ్లున్నారు దంపతులు. చాలాకాలం తరువాత వాళ్ళు మళ్ళీవచ్చేరు. వాళ్ళు సాధారణంగా 'సత్తియమే జయమే మనిడా' అని పాడేవారు. మగవాడు చిరతలు వాయించేవాడు. బహుచక్కగా. వాళ్ళపాట వినగానే తులిసెమ్మ బియ్యం పట్టుకు వీధిలోకెళ్ళింది. గాని ఆ ఆడమనిషి ఒక చంకలో బిడ్డని ఎత్తుకుని వుండడం గమనించి తులిసెమ్మ నిలువునా హాదం మండింది. బియ్యం వేసిందిగాని తిట్టుకుంటూ లోపలికొచ్చి పైచెక్క సున్నం వూడిపడేలా తలుపువేసింది, 'ముష్టి వెధవ సంతానం...' అనుకుంటూ

కొత్తగా వచ్చిన పత్రిక తిరగవేస్తుంటే పెద్ద అక్షరాలతో 'కుటుంబ నియంత్రణం' అనే శీర్షిక ఎదురైంది. పత్రిక ఫర్రున చింపివేసింది.

*　　　*　　　*

ఆమె విపరీత ప్రవర్తనకి బంధుమిత్రులు హడలిపోయారు. ప్రతి రోజూ ఏదో ఒక దేవాలయంలో అగుపిస్తూంది. పూజలూ పునస్కారాలూ విధీ విరామం లేకుండా చేస్తూంది. ఈమె ఆటకి తాళం వెయ్యలేక మూర్తి సతమతమౌతున్నాడు.

చివరకామె భర్తనికూడా ధిక్కరించి రాత్రనక పగలనక యెలా బడితే అలా తిరగజొచ్చింది. ఒక్కొక్కప్పుడు అతనికి విసుగెత్తేది.

ఓనాడామె రెండు మైళ్ళ దూరంలో ఉన్న కోవెలకెళ్ళి సాయంత్రం యెనిమిదేశాక యిల్లు జేరింది. హోరని పడుతూన్న వానలో తడిసి ముద్ద యింది. వంటాలేదు పెంటాలేదు. దానిమీద ఆలుమగ లిద్దరిమధ్య పెద్ద కలహం రేగింది. అతనికి ఓర్మిపోయింది. భార్యని చావగొట్టేడు. తను వెళ్ళి హోటల్లో భోంచేశాడు. తులిసెమ్మ అలిగిపడుకుంది. ఇలా తరుచూ జరుగుతూనే వుండేది.

'తులసీ - నిరుడు మీ చెల్లెలు పెళ్ళికి మీవాళ్లు పెట్టిన జరీ అంచు పంచ అగుపించడంలేదు...' రమణమూర్తి గదిలోంచి అన్నాడు.

'ఎందుక్కనిపించదూ - చూస్తేసరి అదే కనిపిస్తుంది. ఇంతలో యే దొంగలొచ్చారు...' తులిసెమ్మ.

ఆ పంచ ఏమయిందో మూర్తికి తెలుసు. పనిమనిషి చెప్పింది. తొలినాడు తను ఆఫీసుకు వెళ్ళాక వాళ్ళ వీధికి ఒక కొండవాడొచ్చాడు. తులిసెమ్మ వాడినింట్లోకి పిలిపించింది. వాడేదో మహత్యం చూపించి ఆశ గొలిపాడు. ఏడాది పోయాక వస్తాము, బిడ్డనెత్తుకుని తులం బంగారం కట్నం జెప్పు కొండరాముడికి' అన్నాట్ట. అంతే! ఆ జరీ అంచు పంచ వాడికిచ్చివేసింది.

ఇలాంటివి చాలా జరిగాయి. వాళ్ళింటికి బంధుమిత్రులెవరూ రారు. ప్రసాదంమావఁ మాత్రం యేమైనా వస్తూ పోతూండేవాడు. అవిడదూషణ భూషణాలు తన శరీరానికిగాని ఆత్మకు గావనుకున్నాడు. అతడితోటే తన దురవస్థ చెప్పుకు ఏడిచేవాడు రమణమూర్తి.

'ఓరే రమణా ! నే జెపుతున్నా విను. అదేం పిచ్చికాదు. నువ్వు అధైర్యంమాత్రం పడకు. నాకు కాస్త మనస్తత్వ శాస్త్రం తెలుసు. మీ ఆవిడకు త్వరలోనే నయం అవుతుంది.'

ఆ తరువాత ఉదయమే వచ్చాడు. ఆదివారం కావడంచేత రమణ మూర్తి కూడా ఇంట్లోనే వున్నాడు. మూడుగంటలైంది. మగాళ్లిద్దరూ కబుర్లాడుకుంటున్నారు.

'మీ కబుర్లు సరేగాని, యీ గారెలు తినండి' అని తులిసెమ్మ ఒక పళ్ళెంతో వేడివేడి గారెలు తెచ్చిపెట్టింది.

'ఎంత ఓపికే అమ్మడూ నీకు-ఇప్పుడిక్కడే నిద్రపోతూన్నట్టే వున్నావు- ఇంతలోనే యెప్పుడుచేశావు యిన్నోటి గారెలు!'

'సడేసడే! నీ పొగడ్తలకిక్కడ పొంగిపోయేవాళ్ళెవరూ లేరుగాని- నీ కుక్కపిల్లకి గారెపెట్టొచ్చా?'

'పెట్టూ, పెట్టూ, పరవాలేదు.'

'దీని వయస్సెంత వుంటుందే కక్కా?' రమణమూర్తి.

'ఎంతరా, రెండునెలలు. బొంబాయిలో ఒక మిత్రుడిచ్చాడు. మంచి జాతైనది.'

తులిసెమ్మ కుక్కపిల్లకి గారెపెట్టి దాని అందాన్ని నిదానించి చూసింది. గోధుమరంగు. తోక కొననుండి మూతివరకూ నున్నగావుంది. కళ్ళు జీడిగింజల్లా వున్నాయి. చెవులు పొడూగ్గా పాలలో పూరీల్లా వేళ్ళాడుతున్నాయి. అది నడిస్తే కాలిగోళ్ళు చిటుకూపటుకూలాడతాయి.

'అమ్మ ముండాకానా! గారెత్తింటున్నావటే! ఉండు మరోటితెస్తా- మావాఁ యీ కుక్క నీ కొడుకేనాఁ?'

'నా కొడుకేవిటే-నీకొడుకే. నీకిద్దామనేతెచ్చా. ఎంత గారాబంగా పెంచుకుంటావో...' అని విరగబడి నవ్వేడు. ఆ నవ్వుతో అతనికి గుండెల్లో నొప్పి వచ్చింది.

'రమణా! చాపవెయ్యి, గుండెల్లో నెప్పివస్తూంది.'

'అదేమిటి కక్కా...' అంటూ మూర్తి చాపవేశాడు. తులిసెమ్మ కూడా ఆతృతగా వచ్చింది.

అతడాయాస పడుతూ చెపుతున్నాడు-'పదేళ్ళక్రితం యీ నొప్పి వచ్చింది, అయిపోయిందనుకున్నాగాని బతికా. తిరిగి ఐదేళ్ళ క్రితం వచ్చింది. అప్పుడూ గండం గడిచింది. కాని, యీసారి గడవదు.' అతడప్పుడే కళ్ళు తేలవేస్తున్నాడు.

'తులసీ! చప్పునవెళ్లి పక్కింటి డాక్టరుగార్ని తీసుకురా...' మూర్తి.

తులిసెమ్మ పరుగుతీస్తుంటే కుక్కపిల్ల కాళ్ళలోపడింది. యదాలాపంగా దాన్ని ఎత్తుకుని పరుగెత్తింది. పరుగెడుతూంటే ఆమెకు కంపరం పుట్టింది. వణుకుతూనే కుక్కపిల్లని మరీ గట్టిగా అదుముకుని పరుగెత్తింది.

డాక్టరువచ్చి, గుండె, నాడి పరీక్షించి ఆయన చనిపోయాడని ప్రకటించి రెండు సానుభూతి వాక్యాలు చెప్పి వెళ్ళిపోయాడు.

తులిసెమ్మ అలాగే నుంచుంది, అచేతనంగా. కొద్దిగా కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి. కుక్కపిల్ల ఆమె ఒడిలోంచి జారిపడి శవంచుట్టూ రెండుసార్లు తిరిగి వచ్చి చెంగున ఆమె ఒడిలోకి యెగిరి కుంయ్ కుంయ్ మంది. తులిసెమ్మ దాన్ని గాఢంగా హృదయానికి హత్తుకుని బావురుమని ఏడ్చింది.

ఆ ఏడుపుకి కారణమైన ఒక బృహద్వాంఛ ఆమె హృదయంలో అంతవరకూ బందీకృతం అయి లోలోనే సుడులుతిరిగింది. అదిప్పుడు తన అవరోధాన్ని పటాల్ని పగలగొట్టుకొని, ఉవ్వెత్తుగా తాళ ప్రమాణం లేచి తరగతరగలై నురగలు క్రక్కుతూ బాహాటంగా ప్రవహించింది ముక్తి పొందిన ఆనందంతో.

ఇప్పుడా దంపతుల సంసారం మూడు పూవులు ఆరు కాయలు.